క్లుప్తంగా

పాశర్లపూడిలో ట్రాఫిక్ జామ్



నిలిచిపోయిన వాహనాలు

మామిడికుదురు: పాశర్లపూడిలో జాతీయ రహదారిపై గురువారం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్ సమీపంలోని అమ్మ సూపర్ మార్కెట్ నుంచి కైకాలపేట వరకు 216వ నబర్ జాతీయ రహదారి అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా పలుమార్లు గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. నగరం పోలీస్ స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యునికి సన్మానం



డాక్టర్ రవికుమార్‌ను సన్మానించిన నాయకులు

మలికిపురం: గ్రామానికి చెందిన రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ నల్లి భాస్కర రావు కుమారుడు ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నల్లి రవికుమార్ హైదరాబాదులో నీలోఫర్ స్త్రీలు, పిల్లల ఆసుపత్రి వైద్యులుగా సేవలందిస్తూ మెడికల్ సూపరిండెంటెంట్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా స్వగ్రామమైన మలికిపురం విచ్చేసిన రవి కుమార్‌ను గ్రామస్తులు గురువారం సన్మానించారు. వైద్య వృత్తిలో గత 30 సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందిస్తున్నారని గ్రామ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గం మాల మహానాడు కన్వీనర్ చింతా రాజబాబు సర్పంచ్ కాకర శ్రీనివాస్ మాజీ సర్పంచ్ తోటి ప్రతాప్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు గెద్దం ఫిలిప్ రాజు నల్లి శివకుమార్ గెద్దం రవీంద్ర. నల్లి బన్ను పెదపాటి వసంతరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

అంబాజీపేట: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం 108 పుష్పాలతో వేంకటేశ్వరస్వామికి అభిషేకం, అర్చన, భోగి పండ్లతో పూజలు నిర్వహించారు. అంబాజీపేట ఆర్య వైశ్య సంఘం మహిళలు రెండేళ్ల నుంచి సౌందర్యలహరి కార్యక్రమాన్ని అభ్యసిస్తున్నారు. అది పూర్తి అయిన సందర్భంగా మార్గశిర మాసం గురువారం అమ్మ వారికి నివేదన సమర్పించారు. దీంతో పాటు వేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో నిట్టాల హైమ, పెంటపాటి రత్నం, గాదే సాయి, కాజా విశాలాక్షి, కోట్ల శుభ, కుమ్మరి కుంట్ల లీల తదితరులు పాల్గొన్నారు.

గర్వించదగ్గ దేశ భక్తుడు సర్దార్ ఉద్దం సింగ్



అంబాజీపేటలో ఉద్దం సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అంబాజీపేట: ప్రముఖ దేశ భక్తుడు సర్దార్ ఉద్దం సింగ్ జయంతిని గురువారం తొండవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం పీవీ కేశవాచార్యులు అధ్యక్షతన జరిగిన సభలో ఉద్దం సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉద్దం సింగ్ లాంటి దేశభక్తిని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఆయన అభిలాషించారు. పాఠశాల సోషల్ టీచర్ గంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగ ఫలితాలను అందిపుచ్చుకొని, దేశాభివృద్ధిలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలకొండ చంద్రరావు, మట్టపర్తి రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

సఖినేటిపల్లి: మండలంలో రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు గురించి ఏవో పీవీ నరసింహారావు రైతులకు వివరించారు. వరిపంటకు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ ఈ నెల 31వ తేదీ లోగా చేయించుకోవాలని సూచించారు. దాళ్వాలో వరి నాట్లు వేస్తున్న రైతులు సాధారణంగా వచ్చే జింకు లోపం గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు తమ శాఖ సిబ్బందిని సలహాలు తీసుకోవాలన్నారు. స్థానిక సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు కందుల సూర్యచంద్రరావు, ప్రజా ప్రతినిధులు, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం..

- గోదావరి మధ్యలో విస్తరించిన సుందర వనం
- బోట్లపై సాగే ప్రయాణం
- పర్యాటకులకు కనువిందు చేస్తున్న మడ అడవులు

సఖినేటిపల్లి: గలగలపారే గోదావరి. ఈ నది మధ్యలో పచ్చని చెట్లతో కనువిందు చేసే అడవులు మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అవే మండల పరిధిలోని గొంది గ్రామ సరిహద్దులో వశిష్ఠ గోదావరి నడుమ వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న మడ అడవులు. వీటిని చూసేందుకు ఎక్కడెక్కడ నుంచో పర్యాటకులు వస్తున్నారు. అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులు, పర్యాటకులు స్వామివారి దర్శనం అనంతరం ఈ అడవులను సందర్శిస్తున్నారు. బోటు షికారుతో ప్రకృతి అందాలను తనివి తీరా ఆస్వాదిస్తున్నారు. అంతేకాకుండా పవిత్రమైన సాగర సంగమం ప్రదేశ సమీపానికి వెళ్లి దర్శించుకుంటున్నారు.

అడవుల విశిష్టత

నీటిలో వేర్లు, మొదళ్లు కనబడుతూ పైన పచ్చని మొక్కలతో ప్రత్యేక ఆకర్షణగా మడ అడవులు ఉంటాయి. మడ అడవుల నడుమ వశిష్ఠ నదీ పాయలు,



గొంది సరిహద్దులో వశిష్ఠ గోదావరిలో విస్తరించి ఉన్న మడ అడవులు



అడవుల్లో ప్రత్యేక ఆకర్షణ పచ్చని మొక్కలు

సింకుల్లో ప్రయాణిస్తూ బోటుపై సాగే ప్రయాణం మధురాను భూతిని కల్పిస్తుంది. మరెక్కడా లేని విధంగా సహజ సిద్ధ ప్రకృతి సోయగాలకు నెలవు ఈ వశిష్ఠ గోదావరి నదీతీర ప్రాంతం. ప్రత్యేకమైన ఈ బోటు ప్రయాణం ప్రకృతి ప్రేమికులకు మరుపురాని అనుభూతినిస్తుంది. ఈ మడ అడవుల అందాలను తిలకించడానికి ప్రత్యేకమైన బోటుల్లో వశిష్ఠ గోదావరి నదిలో వెళ్లాల్సి ఉంటుంది. స్థానిక స్టీమర్ రేవు వద్ద నుంచి సుమారు 40 నిమషాల పాటు గోదావరిలో ప్రయాణించాల్సి ఉంటుంది.



గొంది సరిహద్దులో నదీ ముఖ ద్వారం వద్ద మడ అడవులు



నదీపాయలో పడవ ప్రయాణ మార్గం

ఘనంగా లక్ష్మీనృసింహుని జన్మ నక్షత్ర పూజలు



అంతర్వేది ఆలయంలో నక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీనివాస్‌కు స్వామి చిత్ర పటం ఇస్తున్న సారథి

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని గురువారం స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. తొలుత వశిష్ఠ గోదావరి నది నుంచి కలశలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశలలో ఉంచిన జలాల్లో స్వామివారికి అర్చన చేశారు. అలాగే పంచామృతాభిషేకం, పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో గోదావరి సెంట్రల్ ప్రాజెక్ట్ చైర్మన్ అంతర్వేది ఆలయంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనలు పలికారు. స్వామి చిత్రపటాన్ని ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి అందజేశారు.

హిందూ సమాజ ఐక్యతను చాటుదాం

కమలానంద పీఠం భారతీ స్వామీజీ

మామిడికుదురు: హిందూ ధర్మ పరిరక్షణ కోసం జనవరి 5వ తేదీన విజయవాడలో చేపట్టిన హైందవ శంఖారావానికి హిందువులంతా ఐక్యంగా కదిలి రావాలని విజయవాడ గన్నవరం భువనేశ్వరి పీఠానికి చెందిన కమాలనంద భారతీ స్వామీజీ పిలుపు నిచ్చారు. ఆయన అప్పనపల్లిలో గురువారం జరిగిన హైందవ శంఖారావం సమాయత్తం సభలో మాట్లాడారు. హిందూ సమాజం ఐక్యతను చాటేందుకు హైందవ శంఖారావం సభను ఏర్పాటు చేశామన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. విజయవాడలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం సభ కరపత్రాలను స్వామీజీ ఆవిష్కరించారు. ముందుగా రాజోలు మండలం తాటిపాక మావుళ్లమ్మ ఆలయం నుంచి బైక్ ర్యాలీగా బయలు దేరి అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి వచ్చారు. అర్చకులు బాలబాలాజీ స్వామి



అప్పనపల్లి ఆలయంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వామీజీ

ఆలయం వద్ద స్వామీజీకి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామీజీ ఉభయ దేవేరులతో కొలువు తీరిన బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ అప్పనపల్లి ఆలయంలో బాలబాలాజీ స్వామి కొలువు తీరారని చెప్పారు. ఈ ఆలయంలో ఏడు ప్రదక్షిణలు చేసిన వారి కోరిన కోర్కెలు నెరవేరతాయన్నారు.

మినీ గోకులాల ఎంపికలో పక్షపాతం

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఆరోపణ

అంబాజీపేట: మినీ గోకులాల ఎంపికలో అధికార పార్టీ నాయకులతో పాటు, ప్రభుత్వ అధికారులు కూడా పక్షపాతం వహిస్తున్నారని మొసలపల్లి ఎంపీటీసీ ఎస్.సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతున్న సమయంలో మొసలపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ మినీ గోకులాల ఎంపికలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను విస్మరిస్తున్నారని అన్నారు. దీనిపై పుల్లేటికుర్రు పశువైద్యాధికారి జి.శ్రీనివాస్‌ను అడిగితే అధికార పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, రైతులకు మాత్రమే వస్తాయని సమాధానమిచ్చారని వివరించారు. దీంతో సమావేశంలో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. ఈ విషయమై పశువైద్యాధికారి శ్రీనివాస్‌ను ఎంపీపీ, ఎంపీడీఓలు వివరణ కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మినీ గోకులాల ఎంపిక జరుగుతుందని, ఎటువంటి పక్షపాతం లేదని శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. లూటుకుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో యానిమేటర్లు అవకతవకలకు పాల్పడి లక్షలాది రూపాయలు కాజేసి, పరారవుతున్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై ఐకేపీ ఇన్‌చార్జి, ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతున్న సమయంలో మండలంలోని ఎన్ని గ్రామాలకు ఎంతమేర నిధులు ఇచ్చారని సభ్యులు నిలదీశారు. అయితే ఆ అధికారి నీళ్లు నలమడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మాచవరం, కె.పెదపూడి గ్రామాల్లో యానిమేటర్లు, బీసీ పాయింట్ నిర్వాహకులు రూ.40 లక్షలకు పైగా చేతివాటం ప్రదర్శించి పరారయ్యారని, వారిపై నేటికీ చర్యలు తీసుకోలేదని సర్పంచ్ జల్లి బాలరాజు నిలదీశారు. డ్వాక్రా సంఘాల సమస్యలపై త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, చర్చిద్దామని ఎంపీడీఓ సరోవర్ చెప్పడంతో వివాదం సద్దుమనిగింది. డీటీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచులు నాగాబత్తుల శాంతకుమారి, దొంగ నాగేశ్వరరావు,మద్దింశెటి దొరబాబు, కాండ్రేగుల శ్రీనివాస్, ఎంపీటీసీలు ముత్తాబత్తుల ప్రశాంత్, వాకపల్లి దొరబాబు, నెల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.



అంబాజీపేటలో జరిగిన మండల సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

అంతర్వేది ఉత్సవాల ముహూర్త పత్రిక అందజేత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించే స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల ముహూర్త పత్రికను ఆలయ అర్చకులు, వేదపండితులు గురువారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. ఈ మేరకు దేవస్థానం కార్యాలయంలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ గురువారం మీడియాతో మాట్లాడుతూ పండితులు నిర్ణయించిన ముహూర్త నిర్ణయ ప్రకారం ఫిబ్రవరి 7వ తేదీన రాత్రి 12.55 గంటలకు స్వామివారి కల్యాణం, 8న మధ్యాహ్నం రథోత్సవం, 12న పౌర్ణమి స్నానాలు, 13న సాయంత్రం తెప్పోత్సవం ఉంటుందన్నారు. జనవరి 2వ తేదీన ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నిర్వహణపై అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన సమీక్షా సమావేశం ఏర్పాటు చేశామన్నారు.



అంతర్వేది ఉత్సవాల ముహూర్త పత్రికను ఏసీ సత్యనారాయణకు ఇస్తున్న అర్చకులు

కూరగాయలు పండించేందుకు స్థల పరిశీలన

అయినవిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం కూరగాయలు పండించి ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రామైఖ్య సంఘాలకు రూ.10 వేలు అందజేస్తుందని గ్రామ సర్పంచ్ కుమ్మరి మాధవీలత, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి శైలజ తెలిపారు. గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో సుమారుగా 30 మంది ఉన్నారన్నారు. వీరికి కూరగాయలు పండించి ఇచ్చేందుకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రెండు సెంట్ల భూమిని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, వాటి పరిస్థితిపై ఆరా తీశారు. ఉప సర్పంచ్ చిట్టూరి శ్రీనివాస్, గ్రామ సమైక్య నాయకురాలు ఎ.బంగారమ్మ తదితరులు ఉన్నారు.

పంట కాలువల ఆక్రమణలు తొలగించండి

మలికిపురం: గూడపల్లి గ్రామంలో పంట కాలువల ఆక్రమణలు తొలగించాలని పలువురు రైతులు గ్రామ రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. గూడపల్లిలో గురువారం జరిగిన సదస్సులో తహసీల్దారు టి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా పంట కాలువపై ఇష్టానుసారంగా తూరల వంతెనలు వేయడంతో పాటు చెత్తా పేరుకుపోవడం, ఇంటి మురుగునీరు కాలువల్లోకి వదలడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అలాగే విద్యుత్ తీగలు వల్ల ప్రమాదాలు ఎదరవుతున్నాయని, కొప్పిడి వారి మెరక పాతశాల పరిధిలో తాగునీరు లేదని పలు సమస్యలపై వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందర తాతాజీ, నాయకులు సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

అయినవిల్లి: వరదల్లో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం రైతులు కోరారు. గురువారం మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామంలో సర్పంచులు కుమ్మరి మాధవీలత, సలాది బుచ్చిరాజుల అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అయినవిల్లిలంకలో 4 అర్జీలు, వీరవల్లి పాలెం 7 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అయినవిల్లిలంక ఉప సర్పంచ్ చిట్టూరి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.



గూడపల్లిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

తాగునీటికి ఇక్కట్లు

అయినవిల్లి: కొండుకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 396 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కూల్‌లో ఏర్పాటు మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ చాలా రోజులు పనిచేయడం లేదు. అయితే దీనికి సంబంధించిన అధికారులతో చర్చించిన ఫలితం లేకపోయింది. విద్యార్థులు తమ తాగునీటి అవసరాలో కోసం ప్లాస్టిక్ బాటిల్స్‌తో తెచ్చుకున్నవే సరిపెట్టుకుంటున్నారు. ఒక్కోసారి ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులతో మినరల్ వాటర్ బాటిల్స్ తెప్పించి ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో తాము భోజనం కారం పట్టిన, పొలమారిన తాగునీరు లేక పోవడం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తమ స్కూల్‌లో పాడైన మినీ వాటర్ ప్లాంట్ త్వరిత గతిన మరమత్తులు చేయించి వినియోగం లోకి తీసుకోచ్చి తమ తాగునీటి అవసరాలు తీర్చాలని విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

డ్వాక్రా మహిళల నిరసన



అంబాజీపేటలో నిరసన తెలుపుతున్న మహిళలు

అంబాజీపేట: అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు గురువారం నిరసన తెలిపారు. పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు పరిధిలో డ్వాక్రా సంఘం సభ్యులు చెల్లించిన సొమ్ము రూ.20 లక్షలు ఇంటిగ్రా ఏజెన్సీ నిర్వాహకులు పరమట మణి బ్యాంకుకు చెల్లించకుండా స్వాహా చేశారని, దీనిపై ఫిర్యాదు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఏ విధమైన చర్య తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కంపెనీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. తాము చెల్లించిన సొమ్మును తిరిగి బ్యాంకుకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో గ్రామ సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: మగటపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మగటపల్లి గ్రామానికి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. మగటపల్లి గ్రామంలో మాత్రమే చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

అంబాజీపేట: సబ్ స్టేషన్ రిపైర్స్, 11 కేవీ కొత్త బ్రేకర్ ఏర్పాటులో భాగంగా అంబాజీపేట మండలంలోని ముక్కామల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని ముక్కామల, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, మోడేకుర్రు, చిన్నలంక, వక్కలంక, చిరుతపూడి, పసుపల్లి గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందన్నారు.

పి.గన్నవరం: నరేంద్రపురం 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతు పనులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు.

రంగా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

అలమూరు: పేద ప్రజల ఆశాజ్యోతి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మండల శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రంగా వర్ధంతి గురువారం జరిగింది. మండల కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పార్టీలకతీతంగా పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ నుంచి సంఘ నేతలతో కలిసి బయలుదేరి రథం వీధిలోనున్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రంగా అభిమానులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారుల సమక్షంలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. గ్రామ కాపు సంఘం అధ్యక్షుడు చల్లా నానాజీ, రామానుజుల శేషగిరిరావు, చల్లా వెంకటేశ్వరరావు, ఉండమట్ల బూరయ్య, నామన దుర్గా ప్రసాద్, చల్లా భూషణం తదతరులు పాల్గొన్నారు. అలాగే సంధిపూడి, పినపళ్ల, జొన్నాడ, చొప్పెల్ల గ్రామాల్లోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా

సఖినేటిపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా అని అంతర్వేదికర మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్ర కుమార్ అన్నారు. గురువారం అంతర్వేదికర సైకిల్‌షాపు సెంటర్లోను, కేశవదాసుపాలెం కాలువ మొగ సెంటర్లోను రంగా వర్ధంతిని నిర్వహించారు. రంగా విగ్రహాలకు నాగేంద్రకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యల పోరాటానికై తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు రంగా అని ఆయన కొనియాడారు. రత్నం మెమోరియల్ ఎస్.సి.సంక్షేమ సంఘ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



కేశవదాసుపాలెం కాలువ మొగ సెంటర్లో రంగాకు నివాళులు అర్పిస్తున్న స్థానికులు



అలమూరులో వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రభాకరరావు తదితరులు

రంగాకు నివాళి

పి.గన్నవరం: విజయవాడ మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత వంగవీటి మోహనరంగా బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. వంగవీటి వర్ధంతిని పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వంగవీటి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల జనసేన, బీజేపీ అధ్యక్షులు సాధనాల జేడీ, యర్రంశెట్టి సాయిబాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, నల్లా పెదకాపు, పుచ్చకాయల నర్శింహమూర్తి, దూనబోయిన రవిచంద్ర, పడాల సూపర్, యడ్ల ఏసు, కోట విజయభాస్కర్, గనిశెట్టి శ్రీనివాస్, పోతుమూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో రంగాకు నివాళులర్పిస్తున్న నేతలు



తాటిపాక సెంటరులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు నాయకులు

అంబాజీపేట: కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ వంగవీటి మోహనరంగా వర్ధంతిని అంబాజీపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీహెచ్ స్కూల్ ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి పలువురు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల చంద్రశేఖర్, సొసైటీ మాజీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, కుసుమ శ్రీను, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాటిపాకలో ..

రాజోలు: వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకుని తాటిపాక సెంటరులో ఉన్న రంగా విగ్రహానికి కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు సంఘ నాయకులు పోతు కాశీ, కటికిరెడ్డి బుజ్జి, కొమ్మూరి ఏసు, కటికిరెడ్డి సుబ్రహ్మణ్యం, లంకలపల్లి సుబ్బారావు, యెరుబండి వెంకన్న, యేపుగంటి సత్యనారాయణ, దంగేటి దుర్గారావు, కుంచే పండు, తెలగారెడ్డి వాసు, అప్పన రామకృష్ణ, యెరుబండి చిన్నబుజ్జి, అడ్డాల గోపి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ సబ్ సెంటర్ పరిశీలన



కొమరాడ సబ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

మామిడికుదురు: జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ టీమ్ బృందం సభ్యులైన ఏఎస్‌ఓ కృష్ణమోహన్, డీపీఓ రవి ఆధ్వర్యంలో కొమరాడ సబ్ సెంటర్‌ను గురువారం పరిశీలించింది. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు సంబంధించిన మూడేళ్ల రికార్డులను బృందం పరిశీలించింది. ప్రస్తుతం ఉన్న గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులకు, ఆన్‌లైన్ రికార్డులు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులను గుర్తించడంతో పాటు వారికి అవసరమైన జాగ్రత్తలు తెలిపి మందులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వలవల సత్యవేణి, ఎంపీహెచ్ఈఓ డి.ప్రసాద్, సూపర్‌వైజర్ సీహెచ్ రాజేంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.అరుణ, హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, ఏఎన్ఎం వై.లావణ్య, ఆశ కార్యకర్తలు సీహెచ్ మణి, కేడీ నాగలక్ష్మి పాల్గొన్నారు.